క్లుప్తంగా

మొండి బకాయిల వసూలుకు చర్యలు



మాట్లాడుతున్న పర్సన్ ఇన్‌చార్జి ఆదినారాయణ

పద్మనాభం: గంధవరం సొసైటీలో మొండి బకాయిలను వసూలు చేసేందుకు చర్యలు చేపడతామని పర్సన్ ఇన్‌చార్జి జీవీ ఆదినారాయణ అన్నారు. గంధవరం సొసైటీ మహాజన సభ సొసైటీ ప్రాంగణంలో ఆదివారం జరిగింది. మొండి బకాయిలు చెల్లించని సభ్యుల ఆస్తులను జప్తు చేసేందుకు నోటీసులు జారీ చేయగా కొంత మంది చెల్లించారన్నారు. మిగిలిన వారు ఏప్రిల్ నెలాఖరులోగా చెల్లించకపోతే ఆస్తులు జప్తు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఈవో ఎ.వెంకటరావు, సిరిపురపు వెంకటరావు, పిల్లా వెంకటరమణ, చొప్ప కృష్ణ పాల్గొన్నారు.

రంజాన్.. ముస్లింల జీవితాల్లో వెలుగులు నింపాలి



మజ్జి శ్రీనివాసరావు

తగరపువలస: రంజాన్ పర్వదినం ముస్లిం సోదరుల జీవితాల్లో వెలుగులు నింపాలని వైఎస్సార్ సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు కోరారు. ఆదివారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. అల్లాహ్ తన కరుణా కటాక్షాలతో సమస్త ప్రాణకోటిని కాపాడాలన్నారు. ఈ పండగ సందర్భంగా అందరికీ ఆరోగ్యం, శ్రేయస్సు, ప్రశాంతత లభించాలన్నారు. పండుగ జరుపుకుంటున్న ముస్లింలకు శుభాకాంక్షలు తెలియచేశారు.

ఆర్ఎంపీల సంఘం ఏర్పాటు



ఆర్ఎంపీ నూతన కమిటీ

భీమునిపట్నం: భీమిలి ఆర్ఎంపీల సంఘం ఏర్పడింది. అధ్యక్షులుగా ఎస్.సుగుణ, కార్యదర్శిగా అమిత్, కోశాధికారి జీ.బీ.రాజు, సహాయ కార్యదర్శి జి.అను, ఉపాధ్యక్షులుగా మంగ శివప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా అప్పలకారు, శ్రీనివాసరావు, విజయలక్ష్మి, భవాని ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు ఎస్.ఎల్.రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపీల సేవలు ఎంతో ముఖ్యమైనవని అన్నారు.

ప్రత్యేక అలంకరణలో రాస పోలమాంబ



తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబ అమ్మవారిని శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఆదివారం ఆలయ కమిటి ప్రతినిధులు ప్రత్యేకంగా అలంకరించారు. 100వ అలంకరణలో భాగంగా వివిధ పుష్పాలతో అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఇదే గ్రామానికి చెందిన దుర్గా శ్రీను, విజయలక్ష్మి దంపతులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

జట్లమ్మ ఉత్సవాలకు ముహూర్తం ఖరారు



పద్మనాభం: మండలంలోని పాండ్రంగిలో జట్లమ్మ ఉత్సవాల నిర్వహణకు పెద్దలు ముర్తం ఖరారు చేశారు. జట్లమ్మ ఆలయంలో ఆదివారం గ్రామ పెద్దలు, ప్రజలు ఉత్సవాల నిర్వహణపై సమావేశమై చర్చించారు. మే 12న తొలేళ్ల ఉత్సవం నిర్వహణకు, 13న సిరిమాను ఉత్సవం నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. దీనిలో భాగంగా ఏప్రిల్ 16వ తేదీన సిరిమాను చెట్టును నరికి గ్రామంలోకి తీసుకు వచ్చేందు కు నిశ్చయించారు. 2018లో ఈ ఉత్సవాన్ని నిర్వహించారు. మళ్లీ 2025లో ఈ ఉత్సవాన్ని నిర్వహించేందుకు నిర్ణయించడంతో ప్రాధాన్యత సంతరించుకుంది.

సేవా కార్యక్రమాలు చేస్తూ..నిరసన

మధురవాడ: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని సీపీఎం ప్రజా సంఘాలు సీఐటీయూ, ఐద్వా, డీవైఎఫ్ఐలు ఆధ్వర్యంలో వినూత్న నిరసన చేపట్టారు. మధురవాడలో ఎండలు మండిపోతుండడంతో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసి పాదచారులు, వాహనదారులకు మజ్జిగ పంచుతూ ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. నిత్యావసర ధరలు, కరెంటు అదనపు చార్జీలు తగ్గించాలని, ఆస్తి విలువ ఆధారిత పన్ను వంటివి ప్రజలకు మోయలేని భారంగా మారాయని నినదించారు. ప్రజా సంఘాలు నాయకులు బి. భారతి, డి. కొండమ్మ, డీ ఉమా శైలజ, పి, రాజ్‌కుమార్, డి. అప్పలరాజు, ఎల్. పద్మ, టీకే శారద పాల్గొన్నారు.

చూడచెక్కిన అందాలు



అందమైన డ్రెస్సింగ్ టేబుల్



డబుల్ కాట్ సోయగాలు



తయారీలో ఉన్న డైనింగ్ టేబుల్



పసిపాపల కోసం తయారు చేసిన ఉయ్యాలలు



హుందాతనం ఉట్టి పడే దివాన్ కాట్



కార్పెంటర్ చేతితో జీవం పోసుకున్న రాధాకృష్ణులు, గోమాత శిల్పాలు



కార్పెంటర్లు ఉపయోగించే సంప్రదాయ పరికరాలు



అమ్మకానికి సిద్ధంగా రోకళ్లు



మెషిన్‌లో కార్పెంటర్



చెక్కతో తయారు చేసిన పూజా మందిరం



రోలు

చెక్కతో గృహోపకరణాల తయారీ

కార్పెంటర్లలో పెరుగుతున్న కళాత్మక దృష్టి

పీఎంపాలెం: పంచ పాండవులు ఎంతమంది అని అడిగితే మంచం కోళ్ళులాగా ముగ్గురు అని ఒక వేలు చూపించాడట. అది ఒకప్పటి జనం నోట్లో నానిన మాట. గ్రామీణ ప్రాంతాల్లో నులక..నవారుతో నేసిన మంచాలు ఏదో మూల దర్శనం ఇవ్వచ్చునేమే కాని నేటి ఆధునిక నగర వాసులకు ఇవి మచ్చుకైనా కానరావు. కోట్ల రూపాయలతో నిర్మించిన పెద్ద పెద్ద భవంతులలో చెక్కతో తయారు చేసిన గృహోపకరణాలు లేనిదే ఆ ఇంటి అందం సంపూర్ణం కాదు. హుందాతనం ప్రతిబింబించాలంటే ఇంట్లో ఉన్న వస్తు సామగ్రిని బట్టి ముఖ్యంగా చెక్కతో తయారు చేసిన గృహోపకరణాలు తెలియజేస్తాయి.

నాలుగు కోళ్ల మంచాల స్థానే సింగిల్ కాట్, డబుల్ కాట్ మంచాలు ఆక్రమించాయి. అభిరుచులను బట్టి తలుపులు, గుమ్మాలు మొదలుకుని కిటికీలు వరకూ అందమైన నగిషీలతో కలపతో తయారు చేసిన వస్తు సామగ్రి సంపన్నుల మధ్య తరగతి ఇళ్లల్లో దర్శనమివ్వడం సర్వ సాధారణం అయిపోయింది. ఆధునిక యంత్ర సామగ్రి అందుబాటులోకి రావడంతో తక్కువ వ్యవధిలో అనేక వస్తుసామగ్రిని తయారు చేయగలుగుతున్నామని కార్పెంటర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి సింహ ద్వారం గుమ్మం డిజైన్ బట్టి రూ.28 వేలు మొదలుకుని రూ.50 వేలు కాగా.. డబుల్ కాట్ రూ.25వేల నుంచి రూ.50 వేలు వరకూ ధరలు ఉన్నాయని కార్పెంటర్ షాపు యజమానులు చెబుతున్నారు. అలాగే డైనింగ్ టేబుల్ రూ. 10 వేల నుంచి రూ.50 వేలు, డ్రెస్సింగ్ టేబుల్ అయితే రూ.10 వేలు నుంచి రూ.20 వేలు మధ్య, దివాన్ కాట్ రూ. 20వేలు వరకూ చార్జ్ చేస్తున్నారు. పిండి కొద్దీ రొట్టె అన్న చందంగా ధరలు ఉంటాయని శివ అనే కార్పెంటర్ చెప్పాడు. చెయించుకున్న వస్తువు ఉపయోగించే కలప, డిజైన్, పనితనం బట్టి ధరలు ఉంటాయని గృహోపకరణాల షాపు యజమాని రఘు తెలిపారు.

టేకు కలపతో..

అటవీ కలప వినియోగం నిషేధం. అరణ్యాల నుంచి చెట్టు నరికి తరలించడం ప్రభుత్వ నిబంధనల ప్రకారం నేరం. టేకు కలపనే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. మైదాన ప్రంతంలోని టేకు చెట్లు నరకడం రవాణా చేయడం వంటి ప్రక్రియలో అంతగా ఆటంకాలు ఉండవు. టేకు చెట్టు వయసు, నాణ్యత బట్టి చదరపు అడుగుల లెక్కన కలప కొనుగోలు చేస్తామని కార్పెంటర్లు చెబుతున్నారు.

15 ఏళ్లుగా ఇదే వృత్తిలో ..



కార్పెంటర్‌గా 15 ఏళ్ల అనుభవం ఉంది. నేర్చుకున్న పని కుటుంబ పోషణకు జీవనాధారమైంది. పిల్లలను చదివించుకుంటూ జీవితం హాయిగా సాగిపోతోంది. చేతిలో పని ఉండటంతో బెంగలేదు. నేను పనిచేస్తున్న ప్రస్తుత షాపు **యజమాని బాగా చూసుకుంటారు.** కార్పెంటర్లకు **బాగా డిమాండ్ ఉంది.**

– కె.ఎల్లాజీ, పీఎం పాలెం

మెషీన్‌తో మరింత సులువుగా..



సంప్రదాయ పనికరాలు ఉపయోగిస్తే ఒక పని పూర్తి చేయాలంటే రోజుల సమయం పడుతుంది. అదే మెషీన్ సహాయంతో అయితే వారం రోజులు పట్టే పనిని ఒక్క రోజులో పూర్తి చేయవచ్చు. కటింగ్, డిజైనింగ్, నునుపు చేయడం వంటివి మెషీన్ సహాయంతో చేయగలను. చేతిలో పని ఉన్నందున ఉపాధికి ఢోకాలేదు.

– ఆర్. గరుమూర్తి , పీఎం పాలెం

కార్పెంటర్ వృత్తి గర్వంగా ఉంది...



పదో తరగతి వరకూ చదువుకున్నాను. పై చదువులకు ఆర్థిక స్థోమత లేదు. ఐటీఐ కంటే ఓ కార్పెంటర్ షాపులో చేరితే మంచి పనిమంతుడు వ్వొచ్చునని పెద్దలు చెప్పిన సూచను పాటించాను. సీనియర్ వర్కర్ల సహకారంతో తక్కువ కాలంలోనే కార్పెంటర్ వృత్తిలో ఎన్నో మెళకువలు నేర్చుకున్నాను. సొంత కాళ్ల మీద నిలబడగలనన్న దీమా వచ్చింది. ఈ వృత్తి ఎంతో గర్వంగా ఉంది.

– కె. మణికంఠ, పీఎం పాలెం

కిటకిటలాడిన దేవాలయాలు



వజ్రకవచధారణలో శ్రీలక్ష్మీనారాయణ స్వామి



మధురవాడలో పచ్చడి పంపిణీ చేస్తున్న పౌర సంక్షేమ సంఘం నాయకులు



వజ్రకవచధారణలో స్ఫటికలింగస్వరూపుడు



ఉగాది సంబరాల్లో భాగంగా నృత్యం చేస్తున్న సీనియర్ సిటిజన్స్



శ్రీవారి దర్శనం కోసం బారులుదీరిన భక్తులు



శ్రీరాధా మదన మోహన్‌లకు అభిషేకం చేస్తున్న నిష్కించిన భక్తదాస తదితరులు



మద్దిలో నిర్వహిస్తున్న పంచాంగ శ్రవణం

కొమ్మాది: ఉగాది సందర్భంగా ఆదివారం ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంటేశ్వరస్వామి ఆలయాన్ని (టీడీడీ) ఆదివారం భక్తులు వేల సంఖ్యలో భక్తులు శ్రీవారిని దర్శనం చేసుకున్నారు. వేకువ జామున సుప్రభాత సేవ అనంతరం ఉదయం 6.30 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు దర్శనాలు కల్పించారు. ఉదయం 9 గంటలకు పంచాంగ శ్రవణం, సాయంత్రం పలు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు, సూపరింటెండెంట్ వెంకట రమణ, ఇన్‌స్పెక్టర్లు శివకుమార్, శ్రావణ్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అష్టలక్ష్మి సన్నిధిలో...

స్థానిక అన్నంరాజునగర్‌లోని శ్రీ అష్టలక్ష్మి దేవాలయంలో తెలుగు నూతన సంవత్సరం (ఉగాది)ని పురస్కరించుకుని ఆదివారం ఘనంగా వేడుకలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధరస్వామి తెలిపారు. ఈ సందర్భంగా తెల్లవారు జామున 5 గంటలకు సుప్రభాత సేవ, 7 గంటలకు తోమాల సేవ, అలంకరణ, 8 గంటలకు బంగారు పుష్పంతో శ్రీ లక్ష్మీ నారాయణులకు సువర్ణ పుష్పార్చన, 9 గంటలకు ఉగాది పచ్చడి ప్రసాదం భక్తులకు వితరణ నిర్వహించారు. అనంతరం సాయంత్రం 6గంటలకు నూతన సంవత్సరం సందర్భంగా పంచాంగ శ్రవణం, పలు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ లక్ష్మీనారాయణ స్వామిని, స్ఫటికలింగ స్వరూపుడుని వజ్రం కవచంతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. అదే విధంగా కొమ్మాదిలో గల మూడంతస్తుల శిర్డీసాయి మందిరంలోనూ, బీచ్ రోడ్డు మంగమారిపేట వారీజా ఆశ్రమంలో, రామాద్రిలోనూ, సాగర్‌నగర్ మోగదారమ్మ మహాలక్ష్మి ఆలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఘనంగా ఉగాది వేడుకలు

మధురవాడ: తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని మధురవాడలోని వివిధ ప్రాంతాలలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పలు చోట్ల అమ్మవార్లకు పండగలు నిర్వహించారు. మరికొన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఉగాది పచ్చడిని పంచి పెట్టి, పంచాంగ పఠనం, శ్రవణం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా మధురవాడ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మధురవాడ, ఆదిత్యనగర్ పరిసర ప్రాంతాలలో అధ్యక్షులు నాగోతి సూర్యప్రకాశరావు, కార్యవర్గ సభ్యులు జగన్మోహనరావు, బెల్లాపు పాపారావు, తోట ఆశాస్వరూప్, దువ్వి కావ్యారెడ్డి, మామిడి వరలక్ష్మి తదితరులు ఆధ్వర్యంలో పచ్చడి పంచిపెట్టారు.

➡ చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయం, అధ్యక్ష, కార్యదర్శులు పిళ్లా సూరిబాబు, నాగోతి తాతారావు, ధర్మకర్త చంద్రశేఖర్ పర్యవేక్షణలో, ఐటీ సెజ్ జంక్షన్ మానంఅంజనేయులు కాలనీలో గల శ్రీ లలితా త్రిపుర సందరీ సమేత మహా కామేశ్వర స్వామి ఆలయంలో ధర్మకర్త బొడ్డేపల్లి సురేష్ ఇతర కార్యవర్గ సభ్యులు పర్యవేక్షణ కార్యక్రమాలు జరిగాయి.

➡ స్వతంత్రనగర్‌లో నూకాలమ్మ వారి పండగ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. చంద్రంపాలెం కనక దుర్గమ్మకు పసుపు కుంకుమలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

హరేకృష్ణ వైకుంఠంలో ఉగాది ఉత్సవం

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంపీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో శ్రీరాధా మదన మోహన్ మందిరంలో ఆదివారం శ్రీవిశ్వావసు నామ ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస ఆధ్వర్యంలో ప్రాతఃకాల సమయంలో వేడుకలు ప్రారంభించారు. ముందుగా శ్రీరాధా మదన మోహన్ స్వామి విగ్రహాలకు పంచామృతాలు, సప్తనదుల జలాలు, వివిధ పండ్ల రసాలు, వివిధ రకాల పువ్వులతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శ్రీవిశ్వావసు నామ సంవత్సర ప్రాధాన్యతను భక్తులకు వివరించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 8 వరకు సంకీర్తనలు, అష్టోత్తర పూజలు, ప్రత్యేక హారతి నిర్వహించారు. ఈ సందర్భంగా గంభీరం చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అంబరీస దాస తదితరులు సహాయ సహకారాలు అందించారు.

జాతరలో ఉగాది సంబరాలు

పీఎంపాలెం: జాతర వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం శిల్పారామంలో ఉగాది సంబరాలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ ఉగాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

శిల్పారామంలో..



కూచిపూడి నృత్యప్రదర్శనలో కళాకారులు

పీఎంపాలెం: ఉగాది ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. నగరంలోని జ్యోష్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జస్మిత, నవ్య, చరిష్మా, మోహన, మశ్విత, పావనీ ,గీదిక తదితర బాల కళాకారులు ప్రతిభ చాటుకున్నారు. సీహెచ్ మురళీ గోవింద్ నృత్య దర్శకత్వం వహించారు.

పద్మనాభం మండలంలో..

పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఉగాది వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. రామాలయాలు, రచ్చ బండల వద్ద పంచంగ శ్రవణం నిర్వహించారు. షడ్రుచుల ఉగాది పచ్చడిని ఆరగించారు. ఇళ్లను మామిడి తోరణాలతో అందంగా అలంకరించారు. మద్దిలో జరిగిన పంచంగ శ్రవణంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, కోరాడలో జరిగిన పంచాంగ శ్రవణంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు పాల్గొన్నారు.

నూకాలమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు



ప్రసాదం పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య కమిటీ ప్రతినిధులు



పొట్నూరులోని నూకాలమ్మ ఆలయం వద్ద బారులుదీరిన భక్తులు

భీమునిపట్నం: భీమిలి గ్రామదేవత నూకాలమ్మవారి ఉత్సవాల్లో ఆఖరు రోజు ఆదివారం భక్తులు అమ్మవారి దర్శనానికి భారీగా తరలి వచ్చారు. ఉగాదికూడా కావడంతో ఉదయం ఆరుగంటల నుంచే భక్తులు పెద్ద ఎత్తున విచ్చేశారు. అన్ని క్యూలైన్లలో భక్తులు బారులుదీరారు. ఉత్సవ నిర్వహణ అధికారి శ్రీధర్, కార్యనిర్వహక అధికారి బొంగరాల మురళీమోహన్ ఆధ్వర్యంలో మంచి నీరు, పిల్లలకు బిస్కెట్లు అందించారు. అలాగే మెయిన్‌రోడ్డులో ఆర్యవైశ్య కమిటీ ఆధ్వర్యంలో సుమారు రెండు వేల మంది భక్తులకు పొంగల్ ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కట్టమూరి వెంకన్న, కంచర్ల కామేష్, ఉరిసికల ప్రతాప్, ఉసిరికల వెంకటేష్, బొండా కిరణ్ పాల్గొన్నారు. అలాగే కాపునాడు సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు చెల్లూరి గౌరినాయుడు ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర ప్రసాదాన్ని అందించారు.

ఘనంగా నూకాలమ్మ తిరునాళ్లు

పద్మనాభం: మండలంలోని పొట్నూరులో ఆదివారం నూకాలమ్మ తిరునాళ్లు ఘనంగా జరిగాయి. నూకాలమ్మ ఆలయాన్ని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. పొట్నూరుతో పాటు రెడ్డిపల్లి, శేరిఖండం, తునివలస, సంగుపేట గ్రామాలకు చెందిన భక్తులు ఈ తిరునాళ్ల ఉత్సవంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా సాధుమఠం తీర్థం



వెల్లంకి పైడితల్లమ్మ ఆలయం వద్ద క్యూలో భక్తులు



అలంకరించిన సాధుమఠం

తగరపువలస: ఆనందపురం మండలం వెల్లంకి జాతీయరహదారిని ఆనుకుని సాధుమఠం తీర్థమహోత్సవం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. భక్తులు సాధుమఠాన్ని సందర్శించి విభూతి, పసుపు-కుంకుమలు సమర్పించి అరటిగెలలు వేలాడదీశారు. అనంతరం ఆలయ ఆవరణలోని పైడితల్లమ్మవారికి మొక్కులు సమర్పించారు. ఏటా ఉగాది నుంచి సాధుమఠం తీర్థం మూడు రోజుల పాటు జరుగుతుంది. ఈ సందర్భంగా జాతీయరహదారి వెంట సర్వీస్‌రోడ్లపై వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు పలు రకాల దుకాణాలు ఏర్పాటు చేశారు. ఆలయ ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

మకరతోరణం అందజేత



తాటితూరులో ఊరేగింపుగా తీసుకువస్తున్న మకర తోరణం

తగరపువలస: భీమిలి మండలం తాటితూరులోని శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం శాలివాహన యువజన సేవా సంఘంచే మకర తోరణం అందించడం జరిగింది. ఆలయ ధర్మకర్త అయిన కోనాడ సన్యాసమ్మకు అర్చకుడు అంపోలు శ్రీనివాసరావు చేతుల మీదుగా దీనిని అందించారు. ముందుగా రాజ వీధి నుంచి ఈ మకర తోరణాన్ని బాజాభజంత్రీలతో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శిరిగుడి సంతోషి, ఈశ్వరరావు, మాజీ వైస్ ప్రెసిడెంట్ పతివాడ రాంబాబు, స్థానిక పెద్దలు సరగడ అప్పారావు, శీరపు గౌరి, చింతపల్లి శాలివాహన కమిటి సభ్యులు ఇందులో పాల్గొన్నారు.

➡ చిట్టివలస జ్యూట్ మిల్లు రామాలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో సీనియర్ నాయకుడు రంగూరి సీతారామదొర, గణేష్ కన్నా, ఆలయ కమిటి ప్రతినిధులు జీరు వెంకటరెడ్డి, సుంకర రామ్‌కుమార్, చేట్ల ఎల్లయ్యరెడ్డి, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైన క్రీడాకారులు



క్రీడాకారులను అభినందిస్తున్న కోచ్ సునీల్‌రెడ్డి

కొమ్మాది: బీచ్ రోడ్డు సాగర్‌నగర్ బాస్కెట్ బాల్ అకాడమీలో శిక్షణ పొందిన భావన, శ్రేష్ఠ, నాగచరిత్, జయరామ్‌లు వచ్చేనెల 9వ తేదీన పాండిచ్చేరిలో జాతీయ స్థాయిలో జరగనున్న యూత్ బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికై నట్లు కోచ్ ఆర్. సునీల్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీరు ఇటీవల ఆంధ్రప్రదేశ్ 10వ అంతర్ జిల్లాల జూనియర్ బాస్కెట్ బాల్‌లో నిర్వహించిన పోటీల్లో ఉత్మ ప్రతిభ కనపరిచారని ఆయన తెలిపారు.

దోమల నివారణకు ఫాగింగ్



సంతపేటలో ఫాగింగ్ చేస్తున్న పారిశుధ్య కార్మికుడు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ 1,2 వార్డులలో దోమల నివారణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం వీధులలో ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా పారిశుధ్య సిబ్బంది ఇంటింటా అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఇళ్ల చుట్టూ నీరు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు.